క్లుప్తంగా

రైతును ఆదుకోండి



ఏపీసీడ్స్ ఎండీ శేఖర్‌బాబుకు బొకే అందిస్తున్న డీసీఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో పంటలు సాగు కాలేదని, ముందస్తు రబీ కోసం అవసరమైన శనగ(బెంగాల్ గ్రామ్) విత్తనాలు ఇచ్చి సహకరించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి ఏపీసీడ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ బాబును కోరారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఏపీసీడ్స్ ఎండీని ఆయన కలిసి విత్తనాల కేటాయింపుతోపాటు సబ్సిడీని పెంచే విషయాన్ని పరిశీలించాలని కోరారు. ఏపీసీడ్స్ ఎండీ స్పందిస్తూ.. రైతులతో ముఖాముఖి మాట్లాడామని, అన్ని విధాలా రైతులకు మేలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

26 నుంచి రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 27వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మానవత్వమును పెంపొందించు విద్యావశ్యకత' అనే అంశంపై డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు, 'ప్రకృతియే ఉత్తమ గురువు' అంశంపై ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు, 'ఆచార్య దేవో భవ' అంశంపై 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు.

'పవన్ నోరు అదుపులో పెట్టుకో'

కర్నూలు(అర్బన్): చంద్రబాబు అరెస్ట్ విషయంలో పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ నేత దేరంగుల ఉదయ్‌కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన పాపం పండి ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నాడన్నారు. ఆయన కోసం అంతలా యాగీ చూస్తుండటం బట్టి చూస్తే ఈ స్కాంలో పవన్‌కు కూడా వాటా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమనే భావనతో ఉండాలే తప్ప, అనవసరంగా నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

ఆర్టీసీ స్థలం లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: ఆదోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని 6,292 చదరపు గజాల ఖాళీ స్థలం 15 ఏళ్లకు లీజుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరామం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు టెండరు ఫారాన్ని ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు www.a pmtc.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీసులో దాఖలు చేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేయనున్నట్లు చెప్పారు. కాగా టెండరు ప్రక్రియపై చర్చించేందుకు, సలహాలు, సూచనలకు 16వ తేదీ ఆదోని ఆర్టీసీ గ్యారేజీలో నిర్వహించనున్న ప్రీ-బిడ్ అవగాహన సదస్సుకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఆదోని డిపో మేనేజర్ 99592 25797, కర్నూలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 9959166566 నంబర్లను సంప్రదించాలన్నారు.

'సుంకేసుల'కు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు బుధవారం 375 క్యూసెక్కుల వరద నీటి ఇన్ ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ స్థామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి స్థామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ఆత్మకూరురూరల్: మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన లక్ష్మన్న (42) అనే కౌలు రైతు మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 5.50 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసిన లక్ష్మన్న పంట దిగుబడులు సరిగా రాక రూ.12 లక్షల వరకు అప్పులు అయినట్లు భార్య మల్లమ్మ తెలిపింది. ఈ విషయంపై తరుచూ మదన పడుతు ఉండే వాడని చెప్పింది. లక్ష్మన్నకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం జరిగింది. భార్య ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మన్న మృతదేహానికి పోస్ట్ మార్టం జరిపించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ లోకి దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి యత్నించగా అక్కడే ఉన్న యువకులు కాపాడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కర్నూలు నగరంలోని ముజఫర్ నగర్‌కు చెందిన ఈరమ్మ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో డ్యామ్‌లోకి దూకింది. నీటిలో కొట్టుమిట్టాడుతున్న ఆమెను అక్కడే ఉన్న యువకులు నరేంద్ర, నాగేంద్ర, షరీఫ్, రేపల్లె రాజు, మధు, ఏసు గమనించి ఒడ్డుకు తీసుకొచ్చారు. అనంతరం చికిత్స నిమిత్తం రాజోలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సరిగమల సవ్వడులు

- ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో ఫ్యాకల్టీ నియామకం
- ఓకల్, గాయక్ అసిస్టెంట్, డోలు, మృదంగం కోర్సుల పోస్టుల భర్తీ
- పూర్తిస్థాయి ఫ్యాకల్టీ నియామకంతో కళాశాలకు మహర్దశ



ప్రభుత్వ కళాశాలలో నృత్యం నేర్చుకుంటున్న దృశ్యం



వీణలో శిక్షణ పొందుతున్న యువతీ యువకులు

కర్నూలు కల్చరల్: స్థానిక ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల రాయలసీమలోనే ఏకైక శిక్షణ కేంద్రం. ఇక్కడ సంగీతం, శాస్త్రీయ నృత్యంతో పాటు మరో నాలుగు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ సర్టిఫికెట్, డిప్లమా కోర్సులు చేసిన వారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది ఉన్నతంగా రాణిస్తున్నారు. మరికొందరు సొంతంగా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసుకొని విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి ఫ్యాకల్టీ నియామకం చేపట్టింది. ఖాళీ పోస్టులన్నీ భర్తీ కావడంతో తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. పూర్తిస్థాయి ఫ్యాకల్టీ నియామకంతో కళాశాలకు మహర్దశ రానుంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాలలో ప్రవేశాలు జరుగుతున్నాయి. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవచ్చు.

గత ఐదు విద్యా సంవత్సరాల కాలంలో ప్రవేశాల వివరాలు

కోర్సు	2018-19 విద్యార్థులు	2019-20 విద్యార్థులు	2020-21 విద్యార్థులు	2021-22 విద్యార్థులు	2022-23 విద్యార్థులు	2023-24 విద్యార్థులు
వోకల్ (గాత్రం)	131	106	110	120	146	100
వయోలిన్	46	59	55	73	71	63
మృదంగం	9	11	15	11	16	13
నాదస్వరం	9	6	7	10	11	8
కూచిపూడి నృత్యం	35	43	45	70	81	68
మొత్తం	230	225	232	284	325	253

పూర్తి స్థాయి ఫ్యాకల్టీ

కళాశాలలో గాత్రం, కూచిపూడి, డోలు, మృదంగం, వీణ, నాదస్వరం లాంటి ఆరు కోర్సులు ఉన్నాయి. ప్రతి కోర్సుకు నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమా సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. ప్రభుత్వం కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు కాంట్రాక్ట్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభావంతులైన అధ్యాపకులను ఎంపిక చేసి పోస్టింగ్ ఇచ్చారు. వారందరూ విధుల్లో చేరారు. ఓకల్ (గాత్రం) కోర్సుకు కడప జిల్లాకు చెందిన భరద్వాజ్, రాజమండ్రికి చెందిన శ్రీకిరణ్, గాయక్ అసిస్టెంట్ కోర్సుకు కృష్ణా జిల్లాకు చెందిన వాగ్దేవ్ ప్రసాద్, డోలు కోర్సుకు నెల్లూరు జిల్లాకు చెందిన మల్లికార్జున, మృదంగం కోర్సుకు కర్నూలు జిల్లాకు చెందిన సుధాకర్‌లు నియమితులయ్యారు.

ఉత్తమ బోధన అందిస్తున్నాం



మానసికోల్లాసం, మంచి శరీర దారుఢ్యానికి లలిత కళలు ఉపయోగపడతాయి. ఇటీవల కాలంలో సంగీతం, నృత్యం, నేర్చుకునే వారి సంఖ్య బాగా పెరుగుతోంది. కళాశాలలో అన్ని కోర్సులకు పూర్తి స్థాయిలో నిపుణులైన ఫ్యాకల్టీ నియమితులయ్యారు. తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. కోర్సుల్లో చేరాలనుకునేవారు ఈనెల 30వ తేదీలోగా ప్రవేశాలు పొందవచ్చు. ఆగస్టు 31వ తేదీకి ప్రవేశాలు పూర్తి అయినా రూ.100 ఫైన్‌తో ఈనెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించాం. ఉదయం, సాయంత్రం వేళల్లో తరగతులు ఉంటాయి.

– మునికుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల, కర్నూలు

మానసిక ప్రశాంతత



నేను చిన్నపిల్లల వైద్యురాలిని. నాకు చిన్నప్పటి నుంచి సంగీతం, నృత్యం చాలా ఇష్టం. విద్యార్థి దశలో ఇవి నేర్చుకోలేక పోయాను. తిరుపతిలో మెడిసిన్ చేసే సమయంలో ఫ్రెండ్స్ అందరం సంగీత నేర్చుకోడానికి సంగీత కళాశాలలో చేరాం. కొన్ని రోజులు నేర్చుకున్న తరువాత వీలు కాక మధ్యలోనే ఆపేశాం. ఇప్పుడు వైద్యురాలిగా స్థిరపడ్డాను. విధి నిర్వహణలోని ఒత్తిడి నుంచి మానసిక ప్రశాంతత కోసం కర్నూలు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో చేరాను. వీణ, నృత్యం, సంగీతంలో శిక్షణ పొందుతున్నాను. వీణలో సర్టిఫికెట్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను.

– డాక్టర్ విజయవాణి, కర్నూలు

కూచిపూడి నృత్యంపై ఇష్టంతో..



మాది కేరళ. కర్నూలులో స్థిరపడ్డాం. పిల్లలు స్కూల్‌కు, నా భర్త డ్యూటీకి వెళ్తుండటంతో ఇంట్లో ఒంటరిగా ఉండటం బోర్ అనిపించి ఫ్రెండ్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ కళాశాలలో చేరి 2018 నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నాను. నర్సింగ్ కళాశాలలో ట్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తూ డాన్స్ నేర్చుకుంటున్నాను. ఇప్పటికే సర్టిఫికెట్ కోర్సు పూర్తయింది. డిప్లమా కోర్సు సెకండ్ ఇయర్‌లో ఉన్నాను. నా భర్త సహకారంతోనే ఇవన్నీ సాధ్యమవుతున్నాయి.

– గౌనావత్ శిల్ప, కర్నూలు

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నపిల్లలకు సమయానుసారం టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని మార్కెట్‌యార్డు సచివాలయంలో జరుగుతున్న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యకర్తల రికార్డ్స్, అంగన్‌వాడీ కార్యకర్తల రికార్డులు, ఎంసీపీ కార్డులను పరిశీలించి గర్భిణులకు ఐరన్‌మాత్రలను, బరువు తక్కువ, ఎత్తు తక్కువ పిల్లలకు విటమిన్-ఎ సిరప్, ఐరన్ సిరప్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా కారణం చేత టీకాలు ఇవ్వకపోతే వారి జాబితాను తయారు చేసుకోవాలన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్ పూర్తి చేయాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడవ విడతగా నిర్వహిస్తామన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ నాగశేఖర్

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వన్‌టౌన్ సీఐ నాగశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్-14, అండర్-16, అండర్-18 అండర్-20, అండర్ -23 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంతో మంది క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరత్నాలు మాట్లాడుతూ అథ్లెటిక్స్ పోటీలకు 850 క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 23 వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, స్టేడియం కోచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

– ఈనెల 14న స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టును న్యాయవాది శ్రీధర్, నెట్‌బాల్ సంఘం అధ్యక్షులు నాగరత్నమయ్య బుధవారం అభినందించారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరగాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులు ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్,పీఆర్ ఇంజినీర్లతో హౌసింగ్, రీసర్వే, ఉపాధి హామీ, ఎన్నికల విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కోడుమూరు, ఆదోని , వెల్దుర్తి మండలాల్లోని ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించడంలేదన్నారు. రీసర్వేకు సంబంధించి స్టోన్ ప్లాంటేషన్‌లో కోడుమూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి మండలాలు వెనకబడ్డాయన్నారు. సెప్టెంబర్ 15నాటికి స్టోన్ ప్లాంటేషన్ కచ్చితంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు సవరణ జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారాలను నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలని, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై ఏఈఆర్‌ఓలు దృష్టి సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్‌కు సంబంధించి ఒక్కో రోవర్ బృందం రోజుకు 100 ఎకరాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవస్థానం వైద్యశాలకు విరాళం



ఏఈఓ హరిదాసు, వైద్య సిబ్బందికి మందులను అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం వైద్యశాలకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పలు రకాల మందులను దేవస్థానానికి విరాళంగా అందజేశారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, బలహీనత, గ్యాస్ట్రబుల్ తదితర వాటి నివారణ, ఎముకల బలానికి అవసరమైన ఔషధాలను వీరు అందజేశారు. ఔషధాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు. మందులను సహాయ కార్యనిర్వాహణాధికారి ఎం.హరిదాసుకు అందజేశారు.

కోలుకోలేక మహిళ మృతి

పగిడ్యాల: వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పగడం ఏసమ్మ(62) అనే మహిళ కోలుకోలేక బుధవారం మృతి చెందింది. పగిడ్యాల దేవనగర్ కాలనీకి చెందిన మృతురాలు మూడు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరింది. అక్కడి వైద్యులు మోహన్ పరీక్షించి సెలైన్ బాటిల్స్ పెట్టి సోమవారం రాత్రి నందికొట్కూరు కమ్యూనిటీ హెల్త్ కేంద్రానికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఉదయం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



పెన్షనర్లకు పెన్షన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం 43వ వార్డు 112 సచివాలయం పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు.

మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో మౌలిక వసతుల కల్పనకు రూ.వందల కోట్లు ఖర్చు చేశామన్నారు. సుంకేసుల బ్యారేజీ నుంచి ఎస్ఎస్ ట్యాంకు వరకు రూ.87 కోట్లతో పైపులైన్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. రూ.200 కోట్లతో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లోని వార్డులకు నీటి కొరత ఉండదన్నారు. రూ.23 కోట్లతో నగరంలోని రోడ్ల విస్తరణను చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు రైల్వే ప్రసాదు,రాజేష్, వాహిదా, నాగేశ్వరరావు, రంగన్న, ప్రసాదు, షఫీ, రేణుక, సుశీల పాల్గొన్నారు.

ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు



సంబరాలు చేసుకుంటున్న ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

కర్నూలు కల్చరల్: ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు రావడం సంతోషమని యూనియన్ రీజినల్ కార్యదర్శి ఏవీ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీసీ కర్నూలు-2 డిపో వద్ద బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో కలిసిన తరువాత ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్‌ను అతి పెద్ద సంఘంగా గుర్తించి జీఓ నెం. 97ను జారీ చేశారన్నారు. రాష్ట్ర నాయకత్వం కృషితో ఇది సాధ్యమైందన్నారు. ప్రభుత్వ గుర్తింపుతో మాపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కర్నూలు -1, 2 డిపో యూనియన్ కార్యదర్శులు ఆర్‌వీఎం రావు, జి.మహేశ్వర్‌రావులు మాట్లాడుతూ యూనియన్‌కు గుర్తింపు రావడానికి సహకరించిన ప్రభుత్వ పెద్దలు, ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామోదర్, జి.వి. నరసయ్యకు కృతజ్ఞతలు అన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ముత్యాలరెడ్డి, నాయకులు రబ్బాని, చంద్ర, ఆనంద్, సుజయరాజు, ప్రసాద్, వీరేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ షాపుల వేలాలకు విశేష స్పందన



వేలాలను పర్యవేక్షిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మున్సిపల్ షాపులకు బుధవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న షాపులకు, ఖాళీ షాపులకు బహిరంగ వేలం నిర్వహించారు. వేలాలకు పాటదారులు పోటీ పడ్డారు. వేలంలో పాటదారుల కోసం స్క్రీన్ ఏర్పాటు చేసి వివరాలు తెలియజేస్తూ వేలం నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ మున్సిపల కాంప్లెక్స్‌కు రూ.14.40 లక్షలు, పాత బస్టాండ్ మున్సిపల్ కాంప్లెక్స్‌కు రూ.23.20 లక్షలు, పార్కు రోడ్డు మున్సిపల్ కాంప్లెక్స్‌కు రూ.17.70 లక్షలు, మద్దూరు నగర్ మున్సిపల్ కాంప్లెక్స్‌కు రూ.70.40 లక్షల చొప్పున పాటదారులు పాటపాడి షాపులను దక్కించుకున్నారు. మున్సిపల్ వేలాలను కమిషనర్ భార్గవ్‌తేజ పర్యవేక్షించారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, మన్సూర్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం



స్టాంటన్‌పురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే

- 38, 39, 40 వార్డులలో రూ.1.69 కోట్లతో అభివృద్ధి పనులు
- శంకుస్థాపన చేసిన మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ సాధారణ నిధులు రూ.1.69 కోట్లతో 38వ వార్డులో రూ.49.34లక్షలతో పార్కు, సామూహిక మరుగుదొడ్లు, 39వ వార్డులో రూ.45లక్షలు, 40వ వార్డులో రూ.75 లక్షలతో రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ, పూలబొకేలు, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని వార్డులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయడంతో పాటు వార్డులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు రవిశాస్త్రి, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సాంబ, సచివాలయ కన్వీనర్లు ముజమ్మిల్, కరీముల్లా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో నిలిచిన కర్మిషా

కల్లూరు : జిల్లా స్టేడియంలో జరుగుతున్న అథ్లెటిక్ పోటీలలో మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ) విద్యార్థినులు రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు. బుధవారం జరిగిన అథ్లెటిక్ పోటీలో ఇంటర్ విద్యార్థిని సాయి ప్రియ అండర్ -18 గ్రూప్‌లో 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించిందన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సాలీషా అండర్- 18 గ్రూప్‌లో 100 మీరట్ల పరుగు పందెంలో రెండవ స్థానం, పదో తరగతి విద్యార్థిని సోఫియా అండర్ 16- గ్రూప్ 400 మీటర్ల పరుగు పెందెంలో మూడవ స్థానం, కరిష్మా అండర్ 14 గ్రూప్ తొమ్మిదవ తరగతి లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, రిజ్వాన అండర్ -16 గ్రూప్ ఎనిమిదోవ తరగతి 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. నలుగురు విద్యార్థినులు రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక విద్యదే కీలక పాత్ర



శాట్విన్ జనరల్ మేనేజర్ ఉదయకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల బృందం

కల్లూరు : దేశాభివృద్ధిలో సాంకేతిక విద్యదే కీలక పాత్ర అని శాట్విన్ జనరల్ మేనేజర్ (రిక్రూట్మెంట్) ఎస్.ఉదయకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉదయకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే కష్టపడితే కానీ విజయం సాధించలేమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. నవీన్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.